క్లుప్తంగా

13 నుంచి కృత్రిమ చేతుల పంపిణీ



మంగళగిరి: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో అక్టోబర్ 13 నుంచి 17 వ తేదీ వరకు పట్టణంలోని వీటీజేఎం ఐవీటీఆర్ డిగ్రీ కళాశాల ఆవరణలో కృత్రిమ చేతులు పంపిణీ చేయనున్నట్లు రోటరీ క్లబ్ అధ్యక్షుడు ప్రగడ రాజశేఖర్ తెలిపారు. ఆదివారం నగర పరిధిలోని ఎయిమ్స్ సమీపంలోని ఏకో పార్కులో మంగళకరం పేరుతో కృత్రిమ చేతులు పంపిణీ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. రెండేళ్లుగా ఎంతో మంది దివ్యాంగులకు రోటరీ క్లబ్ ఆధ్వర్యాన కృత్రిమ చేతులు పంపిణీ చేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు పారేపల్లి నిరంజన్ గుప్తా, ఇసునూరి చక్రవర్తి, కాంద్రు రవికుమార్, చనుమోలు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై సదస్సు



దుగ్గిరాల: అందరూ ఏఐని నేర్చుకోవాలని విట్ ఏపీ ప్రొఫెసర్ బి.రంజిత్‌కుమార్ సూచించారు. శనివారం దుగ్గిరాల మండలం చింతలపూడిలోని ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలలో ఏఐపై సదస్సు జరిగింది. రంజిత్‌కుమార్ మాట్లాడుతూ ఇంజినీరింగ్ విభాగంలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని, ఏఐతో విద్యార్థులకు భవిష్యత్తు ఉన్నతంగా ఉంటుందని తెలిపారు. మెషిన్ లెర్నింగ్‌పై అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ చందు రామారావు, సెక్రటరీ చందు విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ లక్ష్మీ నారాయణ, హెచ్ఓడీ సరోజని, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తి నింపడానికే..



మంగళగిరి: విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి నింపడానికే ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు డాన్ బాస్కో స్కూల్ కరస్పాండెంట్, ఫాదర్ జోజప్ప తెలిపారు. యర్రబాలెం డాన్ బాస్కో స్కూలు స్థాపించి 50 సంవత్సరాలు అయిన సందర్భంగా సువర్ణోత్సవాల పేరుతో అనేక సేవా కార్యక్రమాలు, రాష్ట్ర స్థాయి క్రీడల పోటీలు నిర్వహిస్తున్నట్లు స్కూలు జోజప్ప పేర్కొన్నారు. ఆదివారం రాష్ట్ర స్థాయి క్రీడల పోటీల వాల్‌పోస్టర్లును ఆవిష్కరించారు. పాల్గొనదలచిన జట్లు ఈ నెల 24వ తేదీ లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈ నెల 26 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు పోటీలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాణి, మురళి, సుధాకర్, సిమ్రాన్, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సమస్యలు పరిష్కరించండి



తాడేపల్లి రూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలకు ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా స్టీవెన్ మాట్లాడుతూ కార్మికులు తమకు న్యాయంగా రావాల్సిన బకాయిల కోసం 292 రోజులుగా పోరాటం చేస్తున్నారని, అయినా ప్రభుత్వానికి పట్టడం లేదన్నారు. కోర్టులు కార్మికులకు అనుకూలంగా తీర్పులు ఇచ్చినా యాజమాన్యం కార్మికులకు ఇవ్వాల్సిన బకాయిని చెల్లించకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు శౌరి బత్తులు, తుపాకుల నాగేశ్వరరావు, కార్మికులు దుర్గాభవాని, షేక్ సుభాని, నవనీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

మోహన్‌లాల్‌కు దాదా సాహెబ్ అవార్డుపై హర్షం

తెనాలిరూరల్: విలక్షణ నటుడు మోహన్‌లాల్ 2023 సంవత్సరానికి గాను దాదా సాహెబ్ ఫాల్కే అవార్డుకు ఎంపికవడంపై మా–ఏపీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం ఇక్కడి పెదరావూరులోని జరిగిన సమావేశంలో మోహన్‌లాల్‌ను అభినందిస్తూ తీర్మానించినట్టు మా–ఏపీ వ్యవస్థాపకుడు దిలీప్ రాజా తెలిపారు.

కూటమి పాలనలో ప్రజలకు మోసం

వైఎస్సార్ సీపీ మంగళగిరి సమన్వయకర్త డీవీఆర్

మంగళగిరి టౌన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలు ఎంత మోసపోయారో ఆత్మపరిశీలన చేసుకోవాలని మంగళగిరి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి(డీవీఆర్) అన్నారు. మంగళగిరి పట్టణ పరిధిలోని 26వ వార్డులో ఆదివారం బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని పట్టణ అధ్యక్షుడు ఆకురాతి రాజేష్ అధ్యక్షత నిర్వహించారు. ముఖ్యఅతిథి దొంతిరెడ్డి వేమారెడ్డి మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ప్రజలు ఎంత లబ్ధిపొందారో ఆలోచించుకోవాలన్నారు. మహిళలంటే చంద్రబాబుకు చిన్నచూపని విమర్శించారు.

మళ్లీ జగన్‌ను గెలిపించుకోవాలి

మంచి విద్య, వైద్యం కావాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఎన్నికల ముందు ఇచ్చి వాగ్దానాలను అధికారంలోకి వచ్చిన తర్వాత చంద్రబాబు మరచిపోతారని వ్యాఖ్యానించారు. కూటమి ప్రభుత్వ మోసపూరిత మేనిఫెస్టోను వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి వివరించాలని సూచించారు. బాబు చేసిన మోసాలు ప్రజలకు శాపంగా మారాయని, ముఖ్యమంత్రిగా పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. అనంతరం క్యూ ఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మంగళగిరి పట్టణ గౌరవ అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, పట్టణ మహిళా విభాగ అధ్యక్షురాలు సంకే సునీత, గుంటూరు జిల్లా యాక్టివిటీ కార్యదర్శి మల్లవరపు సుధారాణి, పట్టణ ఉపాధ్యక్షులు షేక్ మహబూ, పంచాయితీ విభాగం స్టేట్ సెక్రటరీ ఫిరోజ్, కొశనమ్ శ్రీనివాసరావు, పట్టణ యువజనన విభాగ అధ్యక్షులు మాదాల గోపి, బాజీ, షేక్ నాగుల్ మీరా, మస్తాన్ వలి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.



క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న డీవీఆర్, ఇతర నాయకులు

ప్రజలు ఆత్మపరిశీలన చేసుకోవాలి

యర్రబాలెం(మంగళగిరి): సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలు ఎంత లబ్ధి పొందారో..చంద్రబాబు అధికారంలోకి వచ్చిన అనంతరం ఎంత లబ్ధి పొందుతున్నారో బేరీజు వేసుకుని ప్రజలు ఆత్మపరిశీలన చేసుకోవాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి కోరారు. యర్రబాలెంలో ఆదివారం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. వేమారెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు మోసపు హామీలతో నష్టపోయింది మహిళలు మాత్రమేనన్నారు. పిల్లలకు ఉజ్వల భవిష్యత్తు విద్య ఒక్కటే అందిస్తుందని నమ్మిన నాయకులు వైఎస్సార్, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. పేదలకు విద్యను దూరం చేసి కార్పొరేట్ స్కూళ్లు, కళాశాలలను పెంచి పోషిస్తున్న ఘనత చంద్రబాబుది అని విమర్శించారు.

మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేసి పేదలకు ఉచిత వైద్యను దూరం చేస్తున్న చంద్రబాబు మోసాలను ప్రజలు గమనించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నాలి వెంకటకృష్ణ, నేతలు షేక్ బడేమియా, లేళ్ల శివకోటేశ్వరరావు, షేక్ గౌస్, మేరుగ నాగేశ్వరరావు, ఆకుల శంకర్, డి.ఇందిర, దాసరి ప్రియానందం,షేక్ జిలాని బాషా, దాసిరి అనిల్, ఉయ్యాల చెన్నయ్య, దానబోయిన నాగయ్య, సయ్యద్ హుస్సేన్ బాషా, గాలి విజయ్‌కుమార్, చిల్లపల్లి శ్రీనివాసులు, సాలి బంగారయ్య, వనిమిరెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'తూనికలు, కొలతలు' విస్తృత తనిఖీలు

తాడేపల్లి రూరల్: ప్రకాశం బ్యారేజ్, ఉండవల్లి సెంటర్ ప్రాంతాల్లో తెనాలి తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ శేషసాయి ఆధ్వర్యంలో ఆదివారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. ముందుగా పట్టణ పరిధిలోని సీతానగరం పుష్కరఘాట్‌లకు వెళ్లే మార్గంలో చేపలు అమ్మే వద్ద తనిఖీలు చేయగా అందులో 5 ఎలక్ట్రికల్ కాటాలు, 10 మామూలు కాటాలను కొలతల్లో భారీ వ్యత్యాసం ఉండడంతో వాటిని సీజ్‌చేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ శేషసాయి మాట్లాడుతూ ప్రకాశం బ్యారేజ్ నుంచి ఉండవల్లి సెంటర్ వరకు పలు చేపల దుకాణాలు, మాంసం విక్రయాల షాపుల్లో తనిఖీలు నిర్వహించామని, చేపల విక్రయదారుల కాటాల్లో భారీ వ్యత్యాసం ఉందని, చికెన్ షాపుల్లో ఉన్న కాటాల్లో కొలతల్లో ఎటువంటి వ్యత్యాసం కనిపించలేదు. కొంతమంది వద్ద లైసెన్స్ టైమ్ అయిపోవడంతో మళ్లీ లైసెన్స్ రెన్యువల్ చేశామని ఆయన తెలిపారు. తనిఖీల్లో టెక్నికల్ అసిస్టెంట్ రవికుమార్ ఇతర ఇబ్బంది పాల్గొన్నారు.



తెనాలి తూనికలు కొలతల సిబ్బంది సీజ్ చేసిన కాటాలు

భారీ వర్షం

- పేరేచర్ల బ్రిడ్జి సమీపంలో నిలిచిన నీరు
- ప్రజలకు తప్పని తిప్పలు

మేడికొండూరు: మేడికొండూరు మండలంలోని పేరేచర్ల గ్రామం డొంక ప్రాంతంలో నివసిస్తున్న సుమారు 100 కుటుంబాలు ఆదివారం కురిసిన వర్షానికి తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. చిన్నపాటి వర్షానికే ఈ లోతట్టు ప్రాంతంలోని ఇళ్లలోకి మోకాలి లోతు వరకు వర్షం నీరు చేరడంతో ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. గ్రామంలో సరైన మురుగునీటి పారుదల వ్యవస్థ లేకే ఈ సమస్య తలెత్తిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కూడా ఇదే సమస్య ఎదురైందని, పలుమార్లు గ్రామ పంచాయతీ అధికారులకు విన్నవించుకున్నా చర్యలు తీసుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటి గుమ్మాల వద్ద ఇసుక బస్తాలు అడ్డంగా పెట్టినా, వర్షపు నీటి ప్రవాహాన్ని అడ్డుకోలేకపోయారని కొందరు చెప్పారు. అధికారులు స్పందించి మురుగునీటి పారుదల వ్యవస్థను మెరుగుపరచాలని కోరారు.

తాడేపల్లి రూరల్: మంగళగిరి నియోజకవర్గ వ్యాప్తంగా భారీ వర్షం కురియడంతో ప్రధాన రహదారుల్లో వాన నీరు నిలిచిపోయింది. ఆదివారం పలుచోట్ల నీరు నిలవడతో పాదచారులు, ద్విచక్ర వాహనచోదకులు తిప్పలు తప్పలేదు. ప్రధానంగా 16వ నంబర్ జాతీయ రహదారి వెంబడి కృష్ణానదిపై ఉన్న కనకదుర్గ వారధి నుంచి మంగళగిరి ఎన్ఆర్ఐ హాస్పిటల్ వరకు జాతీయ రహదారి వెంట సర్వీస్‌రోడ్లను కలుపుతూ రోడ్డు ఏర్పాటు చేశారు. శనివారం కురిసిన వర్షానికి ప్రతి అండర్‌పాస్ వద్ద నీరు నిలిచి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జాతీయ రహదారి వెంట డ్రైనేజీలు ఏర్పాటు చేసినా అవి పూర్తిగా పూడుకుపోయాయి. తాడేపల్లి ఓల్డ్ టోల్‌గేటు వద్ద, మణిపాల్ హాస్పిటల్ ప్రాంతాల్లో 24 గంటలు గడిచినా వర్షం నీరు బయటకు వెళ్లలేదు.



పేరేచర్ల ఇళ్లల్లోకి చేరిన వర్షపు నీరు



మణిపాల్ హాస్పిటల్ వద్ద విజయవాడనుంచి గుంటూరు వెళ్లే రహదారిలో నీరు

సంఘ సంస్కర్త గురజాడ

తాడేపల్లి రూరల్: మూఢ విశ్వాసాలు, మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా సంఘాన్ని మేల్కొల్పిన సంస్కర్త గురజాడ అప్పారావు అని అతిథులు కొనియాడారు. గురజాడ జయంతిని ఆదివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని కొత్తూరుశాఖ సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ గురజాడ అప్పారావు 1862 సెప్టెంబర్ 21న జన్మించారని, తన రచనల ద్వారా సాంఘిక పరివర్తనకు ప్రయత్నించిన మహాకవి అన్నారు. ఆయన రచించిన కన్యాశుల్కం నాటకం బాగా ప్రాచుర్యం పొందిందన్నారు. అనంతరం బాలబాలికలకు గురజాడ అప్పారావు జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏపీ రజక వృత్తిదారుల సంఘం గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి బొజ్జ సుబ్బారావు, మహిళా సంఘం రాష్ట్ర నాయకురాలు శ్రీనివాసకుమారి, రైతు సంఘం నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, బుర్రముక్కు వేణుగోపాల్ రెడ్డి, అరవింద స్కూల్ టీచర్ లక్ష్మి, కేసరి పూజిత, రేఖకుమారి, బాలబాలికలు తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లి రూరల్ : సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు 136వ జయంతిని పురస్కరించుకుని తాడేపల్లి రూరల్, కొలనుకొండలోని ఐద్వా రాష్ట్ర కార్యాలయంలో ఆయన జయంతి వేడుకలను నిర్వహించారు. ముందుగా గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి రమణి మాట్లాడుతూ 115 సంవత్సరాల క్రితమే మహిళలపై ఆయనకున్న దూరదృష్టి అపూర్వమైనదని కొనియాడారు. కన్యాశుల్కం, పుత్తడిబొమ్మ పూర్ణమ్మ వంటి రచనలు సమాజంలో ఈ రోజు వరకు సజీవంగా ప్రదర్శిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీదేవి, అమలశ్రీ, శ్రీలత, సుమ, సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.



గురజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు



గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఐద్వా నేతలు

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

మంగళగిరి టౌన్: సీజనల్ వ్యాధుల దృష్ట్యా మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ అందుబాటులో ఉన్నట్లు ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్‌బాషా తెలిపారు. ఆదివారం ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలోమాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ మార్పుల దృష్ట్యా నగరంలో అంటువ్యాధులు ప్రబలవచ్చని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అతిసార, డెంగీ, మలేరియా వంటి ఏ సమస్య ఉన్నా, అనుమానాలు ఉన్నా కంట్రోల్ రూంకు సమాచారం అందించాలని కోరారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. అనారోగ్య లక్షణాలను గుర్తిస్తే వెంటనే సమీపంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు. వీఎంసీ కార్యాలయంలో 7093912653, 08645–295192 నంబర్లతో కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేశామని తెలిపారు.

యువకుల చేతిలో కొండచిలువ హతం



తాడేపల్లి రూరల్ : మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నివాసానికి సమీపంలో ఆదివారం రాత్రి ఓ భారీ కొండ చిలువను స్థానికులు చంపారు. రెండు రోజుల నుంచి రోడ్డుకు రెండువైపులా తిరగడాన్ని స్థానికులు గమనించారు. శనివారం రాత్రి 12 గంటల సమయంలో కూడా అదే రోడ్డులో తిరుగుతూ కనిపించింది. ప్రతిరోజూ వందలాది మంది ఆ రోడ్డులో వాకింగ్ చేస్తుంటారు. రాత్రి సమయంలో రోడ్డు దాటుతూ ఉండగా ద్విచక్ర వాహనం కొండచిలువ మీదుగా వెళ్లింది. దీంతో గాయపడి రోడ్డుపై అటు ఇటు తిరుగుతోంది. వాకింగ్ చేసేవారు భయభ్రాంతులకు గురి కావడంతో అక్కడి యువకులు దాన్ని చంపేశారు. కొండచిలువ సుమారు ఎనిమిది అడుగులు ఉంది.

దసరా శోభ

- నేటి నుంచి శరన్నవరాత్రులు
- ఆలయాలకు రంగులతో కొత్త కళ
- దసరా నవరాత్రులకు ఏర్పాట్లు పూర్తి



అమ్మవారి మూలవిరాట్

ఫిరంగిపురం: మండలంలోని పలు ఆలయాలకు దసరా శోభ వచ్చింది, దసరా శరన్నవరాత్రులు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉత్సవాల సందర్భంగా ఆలయాలను రంగులతో శోభాయమానంగా అలంకరించి, విద్యుత్‌దీపాలు ఏర్పాటు చేశారు. అమీనాబాద్‌లోని మూలాంకురేశ్వరి ఆలయంలో నవరాత్రులు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు గడియారం అయ్యన్నశాస్త్రి, ఆలయ అభివృద్ధికమిటీ చైర్మన్ బత్తుల వేణుగోపాలబాబులు తెలిపారు. ఫిరంగిపురంలోని కాళహస్తీస్వర ఆలయం, వాసవీకన్యకాపరమేశ్వరి ఆలయం, విజయదుర్గామాత ఆలయం, వేములూరిపాడులోని జలపాలేశ్వర ఆలయం, నుదురుపాడు, పొనుగుపాడు, వేమవరం, గొల్లపాలెం, 113.తాళ్లూరు, తక్కెళ్లపాడు, మేరికపూడి గ్రామాల్లోని కాశీవిశ్వేశ్వర ఆలయాల్లో నవరాత్రుల ఉత్సవాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. తొమ్మిదిరోజుల పాటు తొమ్మిది అవతారాల్లో అమ్మను పూజించనున్నారు.



అమీనాబాద్‌లోని మూలాంకురేశ్వరి ఆలయం



ఫిరంగిపురంలోని కాళహస్తీశ్వర ఆలయం

చలో అసెంబ్లీని జయప్రదం చేయండి

దుగ్గిరాల: నూతన కౌలు రైతులకు చట్టం తీసుకురావాలని, అన్నదాత సుఖీభవ పథకం రూ.20 వేలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం జరగనున్న 'చలో అసెంబ్లీ'ని జయప్రదం చేయాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి మన్నవ నాగమల్లేశ్వరరావు కోరారు. ఆదివారం దుగ్గిరాల మండలంలోని పలు గ్రామాలు సందర్శించి రైతులకు కరపత్రాలు పంపిణీ చేశారు. సమస్యలపై సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ నూతన కౌలు చట్టం తెస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చి, ఇప్పటి వరకు చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. రైతు సమస్యల పరిష్కారానికి విజయవాడ నుంచి అసెంబ్లీ వరకు జరగనున్న ర్యాలీలో రైతులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎస్.రాంబాబు, శ్రీను, శ్రీనివాసరావు, అమ్మిరెడ్డి, మరియ దాసు తదితరులు పాల్గొన్నారు.

నేర ప్రవృత్తిని వీడాలి

మంగళగిరి టౌన్: రౌడీ షీటర్లు నేర ప్రవృత్తిని వీడి సత్‌ప్రవర్తనతో మెలగాలని నార్త్ సబ్ డివిజన్ డీఎస్పీ మురళీకృష్ణ హెచ్చరించారు. మంగళగిరి పట్టణ, రూరల్ పోలీస్‌స్టేషన్లలో ఆదివారం రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీషీటర్లు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించబోమన్నారు. భూదందాలకు పాల్పడకూడదని, గంజాయి సేవించరాదని, విక్రయించకూడదని హెచ్చరించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలు, అసాంఘిక కార్యకలాపాలకు దిగితే సహించబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ వీరాస్వామి, ఎస్ఐ హరిబాబు, రవీంద్రనాయక్, క్రైం సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దు

తాడేపల్లి రూరల్: రౌడీషీటర్లు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుంటే ఉపేక్షించేది లేదని తాడేపల్లి సీఐ వీరేంద్రబాబు హెచ్చరించారు. ఆదివారం తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ వీరేంద్రబాబు మాట్లాడుతూ శాంతిభద్రతలకు భంగం కలిగించే పనులు చేసినా, ఎవరినైనా బెదిరించినా, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. మత్తు పదార్థాలు, గంజాయి కలిగి ఉన్నా, రవాణా చేసినా, కొనుగోలు చేసినా వారిపై ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో ఉండాలని సూచించారు.



రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ మురళీకృష్ణ

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

దుగ్గిరాల: స్థానిక 11 కె.వి మంచికలపూడి ఫీడర్‌లో విద్యుత్ లైన్ల నిర్వహణ చేయనుండటంతో పలుగ్రామాల్లో కరెంట్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ గోపి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కంతంరాజుకొండూరు, మంచికలపూడిలో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

పేదలకు అన్నదానం



మంగళగిరి టౌన్: మంగళగిరి శివాలయం వద్ద ఉన్న శ్రీ పానకాల లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం మెట్ల మార్గంలో ఆదివారం శ్రీ కాశీ అన్నపూర్ణేశ్వరి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ పందేటి సాంబశివరావు మాట్లాడుతూ రెండేళ్ల నుంచి ప్రతి నెల అమావాస్యను పురస్కరించుకుని భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నామని, కార్యక్రమానికి సుమారు 40 మంది దాతలు సహకరిస్తున్నారని తెలిపారు. సుమారు 3 వేల మందికి అన్నదానం చేశామన్నారు. కార్యక్రమంలో పుప్పాల కోటేశ్వరరావు, మన్నెం అరుణ, కర్నాటి శివసత్యనారాయణ, దేవవర్ధన్, నంద్యాల గోపాలకృష్ణ, జంజనం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

24న అమరావతిలో జాబ్ మేళా

450కి పైగా ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

తాడికొండ: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి – శిక్షణ శాఖ ఆధ్వర్యంలో 24న ఉదయం 10 గంటల నుంచి తుళ్లూరులోని స్కిల్ హబ్ కేంద్రంలో 'జాబ్ మేళా' నిర్వహించనున్నట్లు ఏపీ సీఆర్డీఏ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. మేళాలో ఎంపికైన అభ్యర్థులకు అమరావతి పరిసర ప్రాంతాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని పేర్కొన్నారు. మొక్సి ఐటీ డిజిటల్ ప్రైవేట్ లిమిటెడ్, అపోలో ఫార్మసీ, పేటీఎం, ప్రీమియర్ ఎనర్జీస్ ప్రైవేట్ లిమిటెడ్ , ఎల్ఎంఎస్ కార్పొరేట్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలు పాల్గొంటున్నాయని వెల్లడించారు. ఏఎస్‌పీ డాట్ నెట్ డెవలపర్స్, హెల్ప్ డెస్క్ టెక్ సపోర్ట్, వెబ్ డిజైనర్స్, యుఎక్స్ డెవలపర్స్, ఫార్మసిస్టులు, ఫార్మసీ అసిస్టెంట్, ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, గ్రాడ్యుయేట్ ఇంజినీరింగ్ టెక్నీషియన్స్, జూనియర్ టెక్నీషియన్స్, ప్రొడక్షన్ టెక్నీషియన్స్ ఉద్యోగాలను భర్తీ చేసేందుకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. బీటెక్, ఎంసీఏ, డిగ్రీ, ఇంటర్, టెన్త్, ఐటీఐ, డిప్లొమా, బీటెక్, ఏదైనా డిగ్రీ, పీజీ చదివిన ఫ్రెషర్స్, అనుభవం ఉన్న అభ్యర్థులు హాజరుకావాలని సూచించారు. ఎంపికైన అభ్యర్థులకు రూ.10,000 నుంచి రూ. 40,000 వరకు వేతనం లభిస్తుందన్నారు. కొన్ని ఉద్యోగాలకు అదనంగా ఇన్సెంటివ్‌లు, ట్రాన్స్‌పోర్ట్, ఫుడ్, అకామిడేషన్, ఇతర అలవెన్సులు లభిస్తాయని తెలిపారు. జాబ్ మేళా ద్వారా రాజధాని ప్రాంత యువతకు మంచి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి కనుక అర్హత కలిగిన అభ్యర్థులు తప్పకుండా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. వివరాలకు గ్రామంలోని సీఆర్డీఏ ఫెసిలిటేటర్‌ను లేదా శంకర్ (9848424207), శ్రీకర్ (9963425999) నంబర్లలో సంప్రదించాలని తెలిపారు. నైపుణ్యం పోర్టల్ https:// naipunyam.ap.gov. in/లో నమోదు చేసుకోవాలని ఏపీ సీఆర్డీఏ అధికారులు తెలిపారు.

దసరా కరపత్రాలు ఆవిష్కరణ

మంగళగిరి టౌన్: మంగళగిరి పట్టణ పరిధిలోని రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న శ్రీ అఖిలాండేశ్వరి ఆలయంలో సోమవారం నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు శ్రీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలను నిర్వహిస్తున్నట్లు మందిర చైర్మన్ కాలారి సుబ్బారావు అన్నారు. ఆదివారం దసరా నవరాత్రి మహోత్సవాల కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ మన్నెం రమేష్‌బాబు విచ్చేసి కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 22న బాలా త్రిపురసుందరీ దేవి అలంకారంతో ప్రారంభమై, అక్టోబర్ 2వ తేదీన రాజరాజేశ్వరి అలంకారంతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. కార్యక్రమంలో భక్త బృందం ప్రతినిధులు జగదీష్, షరీఫ్, పూజారి పవన్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరి టౌన్: రాజ్యలక్ష్మి అమ్మవారి అలంకారోత్సవాలు ఆలయ ముఖ మండపములో నిర్వహించనున్నట్లు కార్యనిర్వహణాధికారి సునీల్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు శ్రీ మంగళాద్రి లక్ష్మీ నరసింహస్వామి దిగువ సన్నిధిలో శరన్నవరాత్రుల (దసరా) సందర్భంగా అలంకారోత్సవాలు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న రమేష్‌బాబు తదితరులు